RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 191 | జూన్ 25, 2025 | వెల : రూ.3-00



**పశ్చిమాసియాలో చల్లారిన యుద్ధ వాతావరణం**

3లో..



## ఇరాన్ పై అమెరికా దాడిని నిరసిస్తూ ధర్నా

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

గత మూడు రోజుల క్రితం ఇరాన్ అన్వస్త్రాలు తయారు చేస్తున్నదని నేపంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశంపై వైమానిక దాడులు చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని వామపక్ష పార్టీలు ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో ఆ పార్టీల నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ప్రపంచ శాంతివర్ధిల్లాలని ప్రపంచ పోలీస్ అమెరికా ఇజ్రాయిల్ లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి న్యూడెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ సిపిఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాలలు మాట్లాడారు. ఇరాన్ లో ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ సంస్థ పరిశీలన చేసి ఆ దేశం అన్వాయుధాలను తయారు చేస్తుందని ఆధారాలు లేవని ప్రకటించినప్పటికీ ఇరాన్ అన్వస్త్ర రహిత ఒప్పందంపై సంతకం చేసినప్పటికీపశ్చిమ మధ్య ఆసియా ప్రాంతంలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా ఇరాన్ పై దాడులు చేసిందని వారు విమర్శించారు. యుద్ధం వద్దని ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ దేశాలలో ప్రజలు శాంతియాత్రలు ప్రదర్శనలు చేసినా ట్రంపు పట్టించుకోకుండా బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్ పై దాడి చేయించాడని ఈ దాడి ప్రపంచ దేశాలపై తన ఆధిపత్యాన్ని కోల్పోతున్నాననే భయంతోటి జరిగిన దాడిగా చూడాలన్నారు. గత రెండు నెలల క్రితం కాశ్మీర్లోని పెహల్గాంలో టెర్రరిస్టులు ప్రజలను చంపితే ఇరాన్ అధ్యక్షుడు నేరుగా భారత ప్రధాని మోడీకి ఫోన్ చేసి ఈ దాడిని ఖండించారు. ఇప్పుడు అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరన్ పై దాడి చేస్తే అదే ఇరాన్ అధ్యక్షుడు ఈ దాడి గురించి మోడీ ప్రభుత్వానికి తెలియజేస్తే ఇరుదేశాలు కూర్చొని మాట్లాడుకోవాలని పనికిమాలిన సూచనలు మోడీ చేశాడు. రాబోవు రోజుల్లో మూడో ప్రపంచ యుద్ధానికి కూడా అమెరికానే కారణం అవుతుందని ఈ సామ్రాజ్యవాద దురాక్రమణ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం అన్ని రకాల కమ్యూనిస్టు పార్టీలు వివిధ ప్రజా సంఘాల ఆందోళన కార్యక్రమాల్లో కలిసి పోరాడాలని వారు ప్రజలను కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సిపిఎం జిల్లా నాయకులు వలదాసు దుర్గయ్య, సింగారపు బాబు ఎంసిపిఐయు నగర కార్యదర్శి సుంచు జగదీష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు బి నరసింహారావు, ఎస్ యుసిఐ నాయకులు సత్యనారాయణ, డిహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షుడు సంఘీ ఏలేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మా ప్రభుత్వ ప్రయారిటీ రైతే..

- తర్వాతి క్రమంలో యువత
- ద్రోహులెవరో..దొంగలెవరో అసెంబ్లీలో తేలుద్దాం
- గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి
- రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

మా ప్రజా ప్రభుత్వంలో మా మొదటి ప్రాధాన్యం రైతులేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్నదాతల తరువాత మహిళలు, యువత తమ ప్రాధాన్యమని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేల కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా హైదరాబాద్లోని సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎ పాల్గొని మాట్లాడారు.

రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చామని, నిలబెట్టుకున్నామని అన్నారు. 25 లక్షల మందికిపైగా అన్నదాతలకు రుణమాఫీ చేశామని, గత సీఎం కేసీఆర్ వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే అని చెప్పారని,తమ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పామని గుర్తు చేశారు. అంతేకాకుండా 48 గంట్లలో నగదు జమ చేశామని అన్నారు. రైతుభరోసాను విజయవంతంగా పూర్తి చేసి 70లక్షల మంది రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ.9వేల కోట్లు వేశామన్నారు. రైతుల ఆశీర్వాదం వల్లనే తాను చిన్న వయసులోనే సీఎం అయ్యానని చెప్పారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్సార్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని గుర్తు చేశారు. రైతుల అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రం తెలంగాణ అని గర్వంగా చెప్పుకొంటున్నామని, వ్యవసాయం అంటే అన్నదాతను రాజును చేయడమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం కూలడం కూడా జరిగిపోయిందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారని మండి పడ్డారు. కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారని ఆరోపించారు. కానీ, తాము అధికారంలోకి వచ్చిన తరువాత 60,000 ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చామని వెల్లడించారు.

### కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని, మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నామని, మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నామని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టామని, శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించామని తెలిపారు. 1000 బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా చర్యలు చేపట్టామని, 8,000 ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టామని, పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించామని, పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

### గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?

బనకచర్ల ద్వారా చంద్రబాబుకు నీళ్లు ఇస్తున్నామని ఆరోపిస్తున్నారని అన్నారు. గోదావరి జలాలపై అసెంబ్లీలో

మిగతా 4వ పేజీలో..





## రైతు భరోసా సంబరాలకు కదిలిన రైతన్నలు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

హైదరాబాద్‌లోని సచివాలయం సమీపంలో గల రాజీవ్ గాంధీ విగ్రహ ప్రాంగణంలో మంగళవారం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలతో రైతు భరోసా పథకం అమలు చేసి రైతులకు పెట్టుబడి సాయం అందించిన సందర్భంగా రైతు భరోసా సంబరాలు ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు భరోసా సంబురాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ నుంచి బయలుదేరుతున్న రైతుల బస్సును మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు ఐన అతితక్కువ సమయంలోనే దేశంలోనే మొట్ట మొదటి సారిగా 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసి రైతు ప్రభుత్వం అని నిరూపించింది.అలాగే రైతులకు పెట్టుబడి సాయంగా 9 వేల కోట్ల రూపాయలు అందించి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వం అని మరోసారి నిరూపించింది అని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆనందంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు అని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 60 ఏండ్ల ఘన చరిత్ర

- విద్యావనం.. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ
- విద్యార్థి ఉద్యమాలు, పోరాటాలకు నెలవు
- ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహావృక్షం
- 'ఆదర్శ' ప్రైవేటు యాజమాన్యం నుంచి ప్రభుత్వ కాలేజీగా..






**వేద న్యూస్, జమ్మికుంట:**

మొక్కగా 1965లో మొదలైన జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మహావృక్షంగా ఎదిగి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతోంది. కరీంనగర్ జిల్లాలోని సుమారు 50 గ్రామాలకు సెంటర్ పాయింట్‌గా జమ్మికుంట పట్టణకేంద్రంలో ఉన్న ఈ విద్యాకేంద్రం..చైతన్య దీపికగా, విద్యార్థి ఉద్యమాలకు, పోరాటాలకు నెలవుగా నిలుస్తోంది. ఉత్తర తెలంగాణలో అతిపెద్ద వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్న జమ్మికుంట పట్టణంలో.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సువిశాల ప్రాంగణంలో ఉండటం విశేషం. ఎంతో మంది మేధావులు, రచయితలు, కళాకారులు, ప్రముఖులను సమాజానికి అందించిన విద్యావనం 'జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ'.

జమ్మికుంట పట్టణ నడిబొడ్డున, ప్రభుత్వాస్పత్రికి సమీపాన సువిశాల ప్రాంగణంలో జాజి రంగులో ఠీవిగా తలెత్తుకుని నిలిచిన అద్భుతమైన విద్యాకేంద్రం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ. జమ్మికుంట, పరిసర గ్రామాల ప్రముఖులు కలిసి 'ఆదర్శ విద్యా సమితి' అనే విద్యాసంస్థను స్థాపించారు. దీనికి కెవి నారాయణరెడ్డి అధ్యక్షుడు. హుజూరాబాద్ సమీపంలోని సైదాపూర్ వీరి స్వగ్రామం. ఈ విద్యాసమితి సభ్యులు ఎక్కటి అన్నారెడ్డి, అనుగం దుర్గయ్య, ఎర్రంరాజు కృష్ణంరాజు, పి.జనార్దన్‌రెడ్డిల కృషితో ఆదర్శ కాలేజీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి.

1965 సెప్టెంబరు 6వ తేదీన ఈ కాలేజీ 'ఆదర్శ కాలేజ్ ఆఫ్ సైన్స్, కామర్స్ అండ్ ఆర్ట్స్'గా కొత్త వెంకట (కెవి) నారాయణ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. పీయూసీ కోర్సులతో 50 మంది స్టూడెంట్స్‌తో కాలేజీ మొదటి బ్యాచ్ విద్యాభ్యాసం జరిగింది. 1980ల దశకంలో కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండగా, 2008 నుంచి శాతవాహన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా మారింది. కాలేజీకి మొట్టమొదటి ప్రిన్సిపాల్‌గా శ్రీపతి రంగనాథ వ్యవహరించారు. 1965-66 విద్యా సంవత్సరంలో వార్షికోత్సవానికి నాటి ఆర్థిక మంత్రి డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బడిపాఠాలతో పాటు బతుకు పాఠాలను విద్యార్థులకు ఈ కాలేజీలో పని చేసిన ఎందరో గురువులు నేర్పారు, ప్రస్తుత టీచర్లు నేర్పుతున్నారు.

### కాలేజీలో సువిశాల ప్రాంగణం

1965లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఎయిడెడ్ డిగ్రీ కాలేజీగా ప్రారంభమై..1982లో

మిగతా 4వ పేజీలో..



## ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ఢిల్లీ తరహాలో ఆర్డినెన్స్ తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ని కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ నో ప్రాపర్టీ నో లాస్ కింద ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేయాల్సినటువంటి విద్యా సంస్థలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయన్నారు. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలో అడుగుపెట్టింది మొదలు పెన్ను,పెన్సిల్ నుండి పుస్తకాలు,యూనిఫామ్ లు,షూస్, టై,బెల్ట్ యదేచ్ఛగా అమ్ముతు పాఠశాలలను బిజినెస్ సెంటర్లుగా మార్చారని అన్నారు. అధిక ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారాయని అన్నారు.రాష్ట్రంలో విద్య హక్కు చట్టం ఊసే లేదని దీనిపై తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

వేద న్యూస్

బుధవారం, జూన్ 25, 2025

# నోట్ బుక్స్ పంపిణీ




**వేద న్యూస్, మరిపెడ :**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం, తానంచర్ల, గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ పూలే మహాజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చింత వెంకన్న, ప్రజాశక్తి రిపోర్టర్ ఆధ్వర్యంలో తానంచర్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల లో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు, మరిపెడ ఎంఈఓ జి. అనితా దేవి, ముఖ్యఅతిథిగా విచ్చేసి నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మరిపెడ ఎంఈఓ జి. అనితాదేవి మాట్లాడుతూ,నోట్ బుక్స్ పంపిణీ అనేది విద్యను ప్రోత్సహించడం ఒక గొప్ప సేవా కార్యక్రమమని తెలిపారు. విద్యార్థిని,విద్యార్థులకు నోట్ బుక్స్ అందించడం ద్వారా వారి విద్యావసరాలను తీర్చడానికి సహాయపడుతుందని, వారికి ఆర్థిక భారాన్ని తగ్గించడం విద్యార్థిని విద్యార్థులకు చదువును ప్రోత్సహించడం తద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థినీ విద్యార్థులకు చేయూతనివ్వడం అవుతుందని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారు మరింత శ్రద్ధగా చదువుకోవడానికి, గొప్ప లక్ష్యాలను సాధించడానికి ప్రేరణనిస్తాయని అన్నారు. ఈ నోట్ బుక్స్ సద్వినియోగం చేసుకొని, విద్యార్థిని, విద్యార్థులందరూ బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ పూలే మహాజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చింత వెంకన్న, ప్రజాశక్తి రిపోర్టర్, అంబేద్కర్ పూలే మహాజన సంఘం, కమిటీ సభ్యులు చింత దిలీప్, వెంకన్న, తానంచర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం,బి, నిర్మల, ఉపాధ్యాయులు, వి, మాలు,ఎం, వెంకట కోటి,ఎం, అరుణమ్మ,పీ, శ్రీదేవి,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ విజయశాంతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అడుప మహేష్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఎమ్మెల్సీ విజయశాంతి జన్మదిన సందర్భంగా ఏనుమాముల ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ పిసిసి మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ ఫోన్ ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మహేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తెలంగాణలో ఉద్యమ కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్సీ విజయశాంతికి మంత్రి పదవి ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

# ఆ విమానం బ్లాక్ బాక్స్ ను విదేశాలకు పంపలేదు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన బ్లాక్ బాక్స్‌ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపారంటూ వస్తున్న వార్తలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఖండించారు. బ్లాక్ బాక్స్ భారత్‌లోనే ఉందని, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దానిని పరిశీలిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఫిక్కీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్‌క్రాఫ్ట్ సమ్మిట్ 2025' (హెలికాప్టర్లు, చిన్న విమానాల సదస్సు 2025) సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపారనేవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్ బాక్స్ భారత్‌లోనే ఉంది. ప్రస్తుతం దీనిని ఏఏఐబీ విచారిస్తోంది," అని ఆయన స్పష్టం చేశారు. జూన్ 12న లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం, అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సమీపంలోని ఒక హాస్టల్ కాంప్లెక్స్‌పై కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘోర దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మంది ప్రాణాలు కోల్పోగా, ఒక ప్రయాణికుడు మాత్రమే అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద స్థలం నుంచి జూన్ 13న బ్లాక్ బాక్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ నుంచి సమాచారాన్ని వెలికితీయడానికి ఎంత సమయం పడుతుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఇది సాంకేతిక అంశమని, ఏఏఐబీ సరైన పద్ధతులను అనుసరించి విచారణ జరుపుతోందని తెలిపారు. "ఏఏఐబీని దర్యాప్తు చేయనివ్వండి, పూర్తి ప్రక్రియను అనుసరించనివ్వండి" అని ఆయన సూచించారు.

# మోడీ ప్రభుత్వం వెంటనే బీసీ కుల జన గణన చేపట్టాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



- తాటి పాముల వెంకట్రాములు

బీసీ ఉద్యమాలకు తలొగ్గిన మోడీ ప్రభుత్వం కాలయాపనకు పోకుండా తక్షణమే జనగణనతో పాటు బీసీ కుల జనగణన చేపట్టాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్ రాములు డిమాండ్ చేశారు. ములుగులో రిటైర్డ్ టీచర్స్ ఎంప్లాయిస్ బిల్డింగులో ముత్యాల రాజు అధ్యక్షతన జరిగిన ములుగు జిల్లా బీసీ హక్కుల సాధన సమితి మహాసభలో ములుగు జిల్లా ఇంఛార్జి,రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి పాల్గొన్న మహాసభలో వెంకట్ రాములు మాట్లాడుతూ ఈ దేశంలో 1931లో బ్రిటిష్ వారు చేసిన కుల జనగణ తప్ప స్వాతంత్ర్య అనంతరం ఏ ప్రభుత్వం కూడా బీసీల కుల జనగణన చేపట్టలేదన్నారు. ఈ దేశంలో ఉత్పత్తి కులాలైన బీసీలు ఈ దేశాన్ని అన్ని రంగాలలో తమ భుజస్కందాలపై మోస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో బీసీలు నాలుగవ శ్రేణి ప్రజలుగా ఆధిపత్యం పార్టీలు గుర్తిస్తున్నాయన్నారు. దేశంలోని పశువులు పక్షులు, జంతువులను లెక్కలు తీస్తున్న ప్రభుత్వాలు బీసీలకు జనగణన ఎందుకు చేపట్టడం లేదన్నారు. నూటికి 60 శాతం గా ఉన్న బీసీలు కడుతున్న పన్నుల మీద ఈ దేశం నడుస్తున్నదన్నారు కానీ విద్యలో ఉద్యోగ అవకాశాలు కేవలం 27శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయడం దారుణమన్నారు. కుమారస్వామి మాట్లాడుతూ అగ్రవర్ణాల పేదల పేరుతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చి వారికి 10శాతం రిజర్వేషన్ ఇవ్వడం తో మోడీ ప్రభుత్వం కేవలం అగ్రవర్ణాల పక్షపాతి అని తేలిపోయింది అన్నారు. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదన్నారు. కానీ ఎవరు ఎంత శాతం ఉన్నారో లెక్కలు తీసి ఎవరి వాటా వారికి చట్టబద్ధంగా ఇవ్వాలన్నారు. బీసీల ఓట్లతో అధికారం ఎవరికి రావడానికి నేను కూడా బీసీనే అంటూ మోడీ బీసీలను మభ్యపెడితే బీసీల కులగనన చేయడానికి మొదట నిరాకరించిన తర్వాత దిగిరాక తప్పలేదు అన్నారు కానీ ఇది. బీసీ కుల జన గణను 28 దాకా సాగదీసి రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో లబ్ది పొందడానికి మోడీ ప్రభుత్వం, బిజెపి పార్టీ కుట్ర చేస్తుందన్నారు. బడ్జెట్లో బీసీలకు మంత్రిత్వ శాఖను కూడా మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం అగ్రవర్ణపు ఆధిపత్య ధోరణి తెలియచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ బిల్లును తక్షణమే ఆమోదించాలని, వెంటనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీలకు ఇవ్వవలసిన పెండింగ్ నిధులను, వెంటనే మంజూరు చేయాలన్నారు.కామరెడ్డి బీసీ డిక్లరేషన్ సమగ్రంగా అమలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన బీసీ హక్కుల కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించడానికి ఈ మహాసభలో ఎన్నికైన కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ మహాసభలో ములుగు జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజు, ప్రధానకార్యదర్శి బండి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఒడి సారయ్య,సహాయ కార్యదర్శి జక్కుల ఐలయ్య, కోశాధికారిగా కొక్కుల రాజేందర్ లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జంపాల రవిందర్ ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి,ఎండి అమ్జద్ పాషా జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌పై షర్మిల ఫైర్



- అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే ధైర్యం కూడా జగన్‌కు లేదు
- మూడు వాహనాలకు అనుమతి ఉంటే ముప్పై వాహనాలతో వెళుతున్నారు
- నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**వేద న్యూస్, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం నాడు నెల్లూరు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె తన సోదరుడు, వైసీపీ అధ్యక్షుడు జగన్ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రతి విషయంలోనూ జగన్ ప్రజలను వంచించారని, అధికారం చేతిలో ఉన్నప్పుడు ప్రజల వద్దకు వెళ్లని ఆయన, ఇప్పుడు ఓటమి తర్వాత జన సమీకరణ పేరుతో బల ప్రదర్శనలకు దిగుతున్నారని ఆమె మండిపడ్డారు. మాజీ సీఎం జగన్ పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషాద ఘటనపై షర్మిల స్పందించారు. జగన్ కారు సైడ్ బోర్డుపై నిలబడి ప్రయాణించడం మొదటి తప్పని, ఆయన షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన వీడియోను ఫేక్ అని ప్రచారం చేయడం అత్యంత దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. జగన్ తీరును తూర్పారబడుతూ షర్మిల, "జగన్‌కు ఏ నిబంధనలు, ఆంక్షలు వర్తించవా? మూడు వాహనాలకు అనుమతి ఉంటే, ఏకంగా ముప్పై వాహనాలతో వెళుతున్నారు. కార్ల కింద అమాయకులను నలిపేస్తూ, మానవత్వం గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసం?" అని తీవ్రంగా ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే ధైర్యం కూడా జగన్‌కు లేదని ఆమె దుయ్యబట్టారు. "రుషికొండలను ఎందుకు బోడిగా మార్చారు? మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి, మద్యం కుంభకోణానికి ఎందుకు పాల్పడ్డారు?" అంటూ జగన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి నిలబెట్టాల్సిన అవసరం ఉందని భావించే అధిష్ఠానం తనను ఇక్కడికి పంపిందని షర్మిల తెలిపారు. తనకు, జగన్‌కు మధ్య ఉన్న వ్యక్తిగత విభేదాలు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలతో పోలిస్తే చాలా చిన్నవని ఆమె అన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే తమ మధ్య విభేదాలు తలెత్తాయని ఆమె వెల్లడించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడగలిగే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని షర్మిల ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

**- యువత డ్రగ్స్ బారినపడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దు - కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి**

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమానికి కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. పాఠశాల టీచర్లు, సిబ్బంది, విద్యార్థులతో మమేకమైన ఏసీపీ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి బారిన పడకూడదని గొప్పగా చదువుకోవాలని, అందరూ గర్వించే స్థాయికి ఎదిగి పది మందికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. నషా ముక్త్ భారత్ ఫ్రీ ఫ్రమ్ డ్రగ్స్ మోటోగా పెట్టుకుని యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వీక్ గా ఈ వారం ను ఎంచుకొని అవేర్నెస్ కార్యక్రమాలు కాజీపేట డివిజన్ పరిధిలో ఏర్పాటు చేశామని అన్నారు. సిగరెట్లు తాగడం, చూయింగ్ గమ్ నమలడం, పాన్ మసాలాలు తదితర మత్తు కలిగించే పదార్థాలను తీసుకోవడం, యువతీ యువకులు సెంట్రల్ నర్వస్ సిస్టం కి మత్తును కలగజేయాలనే ప్రధాన ఉద్దేశంతో డ్రగ్స్ బారినపడి ఆ మత్తులో రోజంతా తూగడం చేస్తున్నారని అలాంటివారు వెంటనే ఆ మహమ్మారి మత్తులో నుంచి బయటపడి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. సమాజంలో చాలా మంచి అవకాశాలు ఉన్నాయని మన దేశాన్ని యంగ్ ఇండియా గా పిలుస్తారని అంటే ఇండియా మొత్తంలో యువతీ యువకులే అధికంగా ఉన్నారని వారు బలంగా ఉండి గొప్పవారుగా ఎదిగితేనే మన ఇండియా మరింత బలంగా, దృఢంగా తయారవుతుందని, అలా కాకుండా డ్రగ్స్ బారినపడి తమ జీవితాలకు, తమ కుటుంబం, దేశానికి నష్టం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని హితవు పలికారు.



కాజీపేట డివిజన్ పరిధిలోకి కమలాపూర్, హసన్ ప, ఎల్కతుర్తి, ముల్కనూరు, వంగర, కాజీపేట, మడికొండ, వేలేరు, పోలీస్ స్టేషన్లు వస్తాయని ఈ పరిధిలో డ్రగ్స్ పై అందరికీ అవగాహన కల్పించి డ్రగ్స్ కట్టడికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి డ్రగ్స్ తీసుకునే వారిపై, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, అలాగే నార్త్ ఇండియా నుంచి వచ్చే ఉద్యోగులు, కూలీలు అక్కడ డ్రగ్స్ కు అలవాటు పడి అదే సాంప్రదాయాన్ని ఇక్కడికి తీసుకువచ్చి ఇక్కడ కూడా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు కూడా తాము అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు, డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు దృష్టికి వస్తే దయల్ 100 నెంబర్ కి అయిన 1908 నెంబర్ కి అయినా ఫోన్ చేసి సమాచారం అందించాలని మన యొక్క తెలంగాణను ఫ్రీ ఫ్రమ్ డ్రగ్స్ గా తయారు చేసుకుందామని అలా చేయడానికి పోలీస్ డిపార్ట్మెంట్ డ్రగ్స్ నిర్మూలన పై బాగా దృష్టి పెట్టిందని సమాజం మొత్తం ఫ్రీ ఫ్రమ్ డ్రగ్స్ గా ఉండాలనేదే తమ యొక్క పెద్ద లక్ష్యమని ఏసిపి తెలిపారు. అనంతరం పాఠశాల యాజమాన్యంతో సమావేశమైన ఏసీపీ పాఠశాలలో ఉదయం పూట తప్పనిసరిగా జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతమైనటువంటి జనగణమనను విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం మొత్తం ఆలపించేలా ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి ఒక గొప్ప సూచన చేశారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులలో ఇప్పటినుంచే జాతీయ భావం పెంపొందుతుందని, కులమత బేధాభిప్రాయాలు లేకుండా మేమంతా భారతీయులం అనే భావన వారిలో కలుగుతుందని అలాగే విజయవంతమైన వ్యక్తుల జీవిత గాథలను చదివి వినిపించడం, స్వతంత్రం సాధించి పెట్టిన త్యాగధనుల స్ఫూర్తి గాథలు తెలియజేయడం, ఇలా చేయడంవల్ల తామంతా ఎక్కడి నుంచి వచ్చామో, తమకు ఇన్ని సౌకర్యాలు, ఇంత స్వేచ్ఛ, సమానత్వం ఎంతమంది త్యాగధనుల త్యాగాల వల్ల సమకూరాయో విద్యార్థులకు అవగాహన కలిగి చైతన్యవంతులై దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదిగేలా వారికి ఇవి మార్గదర్శకంగా నిలుస్తాయని ఈ సందర్భంగా కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# సంపాదకీయం


## శాంతికి శరణ్యం ప్రజాస్వామ్యమే

శాంతి, సమభావం, సమిష్టి క్షేమమే ఆధునిక ప్రజాస్వామ్య యుగధర్మమని శ్రీశ్రీ పదేపదే వక్కాణించాడు. ప్రజాస్వామ్య పరిపాలనకు ఇదే గీటురాయిగా భావించాలని ఆ మహాకవి తీర్మానించాడు. మనం 21వ శతాబ్దంలో జీవిస్తున్నాం. 20వ శతాబ్దంలో రెండు ప్రపంచ యుద్ధాలను విశ్వమానవాళి చవి చూసింది. మొదటి ప్రపంచయుద్ధ కాలం 1914-19. రెండవ ప్రపంచ యుద్ధ కాలం 1939-44. ఈ రెండు ప్రపంచయుద్ధాల్లో కోట్లాది మంది చనిపోయారు. మరికొన్ని కోట్లమంది క్షతగాత్రులయ్యారు. 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో జపాన్‌లోని హీరోషిమా, నాగసాకి ప్రజానీకంపై ఆమెరికా కురిపించిన ఆటంబాంబుల విషమ ఫలితాలను ఆ దేశం నేటికీ అనుభవిస్తూనే ఉన్నది.

అయినా కొందరు దేశాధి నేతలు (పాలకులు) ఇప్పటికీ కళ్లు తెరవక, చరిత్ర గుణపాఠాలు నేర్వక, ఆధిపత్య స్వార్థంతో, జాత్యాహంకారంతో, మతోన్మాదంతో యుద్ధాలకు తెగబడుతూనే ఉన్నారు. తానుపట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్టు మూర?ంగా వ్యవహరిస్తున్నారు. ఏకపక్షంగా యుద్ధ దాడులు చేస్తూ ఆయా దేశాలను లొంగదీసు కోవాలని చూస్తున్నారు. అక్కడి దేశవనరులు, సహజ సంపద, గనులు, చమురులను కొల్లగొట్టాలని పన్నాగాలు పన్ను తున్నారు. ఆ కారణంతో ఆ దేశ ప్రజలను నయాబానిసలుగా మార్చడం లేదా పొరుగుదేశాలకు కాందిశీకులుగా తరిమిగొట్టే నరరూప రాక్షసులుగా మారుతున్నారు. వీరు ప్రజల ప్రాణాలకు వీసమెత్తు విలువ నీయరు. కరడుగట్టిన అమానుషత్వమే వీరి నరనరాన జీర్ణించుకు పోయినట్టున్నది. పైపై రూపాలేమైనా కావచ్చుగానీ, కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లు అంతిమంగా ఇవి సామ్రాజ్యవాద మార్కెట్ దోపిడీకై సాగే యుద్ధాలని మనం మరువకూడదు. ఇజ్రాయిల్- పాలస్తీనా (గాజా)పై యుద్ధదాడి చేస్తూనే ఇప్పుడు తాజాగా మరల ఇరాన్‌తో యుద్ధపోరుకు తలబడింది. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇజ్రాయిల్ అతిదుర్మార్గంగా ఇరాన్‌లో చొరబడి యురేనియం శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేస్తున్నది. అణుబాంబు తయారీకి ఇరాన్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నదని, ఆ ముప్పునుండి తప్పిం చుకునేందునే తాము ముందస్తు దాడికి దిగామని ఇజ్రాయిల్ నేత నెతన్యాహు అంటున్నాడు. ఇరాన్ నేత ఖొమైనీ అంతమైతేనే యుద్ధానికి ముగింపు అని వాదిస్తున్నాడు. 'ఖొమైనీని మేం ఇప్పుడే చంపం. ఆయన ఎక్కడ దాక్కున్నాడో ఆ జాడ మాకు తెలుసు. అసలే మాకు ఓపిక తక్కువ. త్వరగా భేషరతుగా ఇరాన్ లొంగిపోతే మంచిది' అని ట్రంప్ తన వాచాల త్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. అంతే కాదు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ప్రజలు ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నాడు. గాజా మాదిరి ఇరాన్‌ను కూడా ధ్వంసం చేసి చేజిక్కుంచు కోవాలనేది ట్రంప్ కుట్రగా కనపడుతున్నది. అయితే ఈ యుద్ధం ఎంత కాలం సాగుతుంది? ఎంత విధ్వంసం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు నిర్దాక్షిణ్యంగా గాలిలో కలసిపోతాయి? ఈ యుద్ధం పశ్చిమాసియా అంతా వ్యాపించి, కడకు మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తుందా..? అనేదే యావత్ మానవాళి ముందున్న ప్రశ్న. ట్రంప్ రెండో రాకడ అనంతరం యుద్ధజ్వాలలు ఎగిసేగిసి పడుతున్నాయి. తన జోక్యంతోనే శాంతి లభిస్తుంది అని ట్రంప్ ఎన్ని ప్రగల్బాలు పలికినా రష్యా ఉక్రెయిన్ యుద్ధం అంతం కాలేదు. గాజా సమూల ధ్వంసం వరకూ ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఆదేశ నేత నెతన్యాహూ ప్రకటిస్తునే ఉన్నాడు. ట్రంప్ కూడా తన టూరిజం, రిసార్టుల వ్యాపారం కోసం గాజా వాసులను ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయమని బెదిరి స్తున్నాడు. ఐక్యరాజ్యసమితి శాంతి నియమాలు, అంతర్జాతీయ కోర్టు నిబంధనలను వీరిరువురూ అసలు లెక్కజేయటం లేదు. భారత్- పాక్ మధ్య జరిగిన యుద్ధం తనవల్లే ఆగిందని ట్రంప్ ఒక పక్క చెప్తూనే మరో పక్క ఉగ్రవాద చర్యలకు ఊతం ఇస్తున్నాడు. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయిల్ కాలుదువ్వడానికి కారకుడ య్యాడు. ట్రంప్ అమానుష, నీతి బాహ్య చర్యలకు వ్యతిరేకంగా, సొంత దేశం అమెరికాలోనే లక్షలాది మంది ప్రజలకు 'నో-కెంగ్' ఉద్యమం పేరిట రోడ్ల మీదకు వస్తున్న విషయం తెలిసిందే. అయితే మన భారత దేశం తొలి నుండి శాంతి కాముకదేశం. సత్యం %-% అహింసల ప్రాతిపదికపై వెలసిల్లిన గౌతమ బుద్ధుని త్రిరత్నాలు దేశగతిని మార్చాయంటే అతిశయోక్తి కాదు. బుద్ధం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి శాంతి ఫరిడవిల్లడానికి కారణభూతమవు తున్నాయి. సంపూర్ణ వికాసం కోసం బౌద్ధం, శ్రమైక జీవనం కోసం సంఘం, పరస్పర శాంతి-సహకారం కోసం ధర్మం ప్రతి వ్యక్తికి అవసరం. ఈ మార్గంలోనే గ్రామాలు, నగరాలు, రాజ్యాలు, దేశాలు ప్రగతి పథంలో సాగుతున్నాయి. ప్రజాస్వామ్యానికి ఇదే ప్రాతిపదిక. ప్రజాస్వామ్యంలో చర్చలు ఉంటాయి. ఎదుటివారిని అర్థం చేసుకోవాలనే సంస్కారం ఉంటుంది. నాతో పాటు అందరూ సమానమే అన్ని స్పృహ ఉంటుంది. ఇచ్చిపుచ్చు కునే గౌరవ మర్యాదలు ఉంటాయి. ఇలాంటి చోట ఆధిపత్యానికి అహం కారానికి తావే ఉండదు. ఉమ్మడి శ్రేయస్కరమే తప్ప రెండో మాటకు స్థానమే ఉండదు. ఇవన్నీ మన జీవన శైలిలో నిబిడీకృ తమై ఉన్నాయి. బౌద్ధాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించిన ఆశోకుని ధర్మచక్రాన్ని మనం మన జాతీయ పతాకంలో కేంద్ర స్థానంలో నిలుపు కున్నాము. చక్రంలోని 24 ఆకులు (రేఖలు) 24 గంటలకు సంకేతంగా నిరంతరం ధర్మపథంలో సాగాలని బోధిస్తున్నాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం ప్రపంచశాంతి కోసం ప్రప్రథమంగా 1949 ఏప్రిల్‌లో పారిస్‌లోనూ, ప్రాగ్‌లోనూ మహాసభలు జరిగాయి. 72 దేశాల నుండి రెండు వేలకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సమస్త దేశాల ప్రయోజనాలను రక్షించి సుస్థిర శాంతి స్థాపనే ప్రపంచ శాంతి సమితి లక్ష్యం అని ఉద్ఘాటించారు. 'మానవాళికి నేడు శాంతి అత్యంత ముఖ్యమై నది. శాంతి సాధనలో మనమంతా, సహచరులం' అని అప్పటి మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తెలిపారు. 'మారణా యుధాలను మనం నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం ఉత్తమం' అని జాన్.ఎఫ్. కెన్నడీ అదే సందర్భంలో అన్నారు. ఈ మాటలు చాలా విలువైనవి, ఆచరించదగ్గవి. ఆ తర్వాత మన దేశం అలీన దేశాల కూటమి స్థాపనకు, సారథ్యానికి కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి వచ్చనపుడు యావత్ దేశం రాజకీయా లకు అతీతంగా ఒక్కటిగా నిలిచింది. అలాగే ఇటీవల పహల్గాంలో ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా సాగిన ఆపరేషన్ సిందూర్ చర్యలకు దేశం ఒక్కటిగా మద్దతు తెలిపింది. విపక్షాలకు చెందిన శశిథరూర్, కనిమొళి, జాన్‌బ్రిటాస్, అసదుద్దీన్ ఒవైసీ వంటి వారు విదేశీ వేదికలపై పాక్ ఉగ్రవాదాన్ని నిర్ద్వంద్వంగా ఎండగట్టారు. మన వైఖరి విస్పష్టంగా తెలిపారు. భారతీయుల శాంతి కాముకత విశ్వ వ్యాప్తంగా మరోసారి వెల్లడైంది. 'భిన్నత్వంలో ఏకత్వమే మా బలం' అని భారత్ సగర్వంగా చాటగలిగింది. అయితే యుద్ధోన్మాద, ఉగ్రవాద మూలాలు తెలుసుకుని చైతన్యంతో వ్యవహరించడం సర్వదా శ్రేయస్కరం. పాకిస్తాన్ ఉగ్రవాదానికి అమెరికా ఊతం ఇస్తున్నట్టు తెలుస్తూనే ఉన్నది.

# మెడికోల కుటుంబాలకు అండగా డాక్టర్ షంషీర్..





**వేద న్యూస్, డెస్క్:**

అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో దాదాపు 275 మంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో ప్రయాణిస్తున్న 241 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పో యారు. ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. అయితే.. ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం.. మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై పడటంతో దాదాపు 34 మంది మెడికోలు సైతం మరణించారు.. అయితే.. మెడికోల కుటుంబాలను ఆదుకునేందుకు యూఏఈ వైద్యుడు ముందుకొచ్చాడు.. కి చెందిన డాక్టర్ షంషీర్ వాయాలిల్ రూ.6 కోట్లు (2.5 మిలియన్ దిర్హాంలు) ఆర్థిక సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఎయిర్ ఇండియా ప్రమాదంలో మరణించిన వైద్య విద్యార్థులు, వైద్యులు, గాయపడిన వారి కుటుంబాలకు ప్రథమ చికిత్సగా లో భారతీయ వైద్యుడు రూ.6 కోట్ల సహాయం అందించారు. విమాన ప్రమాదంలో దెబ్బతిన్న మెడికల్ కాలేజీలో విద్యా కార్యకలాపాలు తిరిగి ప్రారంభమైన తర్వాత.. డీన్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సమక్షంలో డాక్టర్ షంషీర్ వాయాలిల్ అందించిన చెక్కులను పంపిణీ చేశారు. ఎయిర్ ఇండియా ఫ్లైట్ 171 ప్రమాదం తర్వాత మెడికల్ కాలేజీలో తరగతులు తిరిగి ప్రారంభమయ్యాయి.. అయినప్పటికీ.. ఆ ప్రాంత వాతావరణం ఇంకా విచారకరంగానే ఉంది. ఈ భయంకరమైన విషాదంలో మునిగిపోయిన బాధిత కుటుంబాలకు, గాయపడిన వారికి మొదటిసారిగా ఆర్థిక సహాయం చేరినప్పుడు భావోద్వేగ క్షణం కనిపించింది. ప్రమాదం జరిగిన కొద్ది రోజులకే హెల్త్‌కేర్ వ్యవస్థాపకుడు, డాక్టర్ షంషీర్ వాయాలిల్ మొత్తం రూ. 6 కోట్ల సహాయాన్ని అందించారు. అబుదాబి నుంచి హెల్త్‌కేర్ ప్రతినిధులు అహ్మదాబాద్‌కు చేరుకున్నారు.. అనంతరం మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ మీనాక్షి పారిఖ్ కార్యాలయంలో జరిగిన ఒక ప్రైవేట్ వేడుకలో బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ ఎస్. జోషి, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా హాజరయ్యారు. ఈ సహాయ మొత్తంలో మొదటి భాగాన్ని ఈ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు వైద్య విద్యార్థుల కుటుంబాలకు అందించారు. ప్రతి కుటుంబానికి 1 కోటి చెక్కును అందజేశారు. వీరిలో గ్వాలియర్ (మధ్యప్రదేశ్) నుండి మొదటి సంవత్సరం విద్యార్థి ఆర్యన్ రాజ్‌పుత్, శ్రీగంగానగర్ (రాజస్థాన్) నుంచి మానవ్ బాదు, బార్మర్ (రాజస్థాన్) నుంచి జైప్రకాష్ చౌదరి, భావ్‌నగర్ (గుజరాత్) నుంచి రాకేష్ గోబర్‌భాయ్ డియోరా కుటుంబాలు ఉన్నాయి. ఈ నలుగురు విద్యార్థులు ఎన్నో కలలతో వైద్య వృత్తిని ఇప్పుడే ప్రారంభించారు.. వారి జీవితాలు చాలా దురదృష్టకర రీతిలో ముగిశాయి.

రాకేష్ డియోరా సోదరుడు విపుల్‌భాయ్ గోబర్‌భాయ్ డియోరా మాట్లాడుతూ.. "మా కుటుంబం మొత్తానికి ఆయన ఆశాకిరణం. మా కుటుంబంలో వైద్య కళాశాలలో అడ్మిషన్ పొందిన మొదటి వ్యక్తి ఆయన. మేము రైతు నేపథ్యం నుండి వచ్చాము. ఆయన పిల్లలను చాలా ప్రేమించేవారు.. పిల్లల గుండె శస్త్రచికిత్స నిపుణుడు కావాలని కోరుకున్నారు. ఈ విషాదం మాకు షాక్ ఇచ్చింది. మాకు ఇంట్లో నలుగురు సోదరీమణులు ఉన్నారు.. తండ్రి ఆరోగ్యం కూడా బాగా లేదు. రాకేషే మా అందరి ఆశ. ఈ సహాయం మాకు చాలా అవసరం.. అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## పశ్చిమాసియాలో చల్లారిన యుద్ధ వాతావరణం

### - అమెరికా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపిన ఇజ్రాయెల్ ప్రధాని

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ఇరాన్ తో అణు ముప్పు తొలగిపోయిం దని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ విషయంలో తమ దేశానికి సహకరించిన అమెరికా అధ్యక్షుడికి నెతన్యాహు కృతజ్ఞతలు తెలిపా రు. డొనాల్డ్ ట్రంప్ సూచనల మేరకు కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్, ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించడంతో, గత కొంతకాలంగా కొన సాగుతున్న ఘర్షణ వాతావరణానికి తెరపడే అవకాశం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. తొలుత ఇరాన్ కాల్పుల విరమ ణను ప్రారంభించినట్లు సమాచారం. దీనికి ప్రతిస్పందనగా, తాము కూడా సీజ్‌ఫైర్‌కు కట్టుబడి ఉంటామని ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన ద్వారా కాల్పుల విరమణ ఒప్పందం వాస్తవమేనని ధ్రువీకరించినట్లయింది.

## ముస్లిం కుటుంబంపై రోడ్డుపైనే దాడి



**వేద న్యూస్, డెస్క్:**

కర్ణాటకకు చెందిన బీజేపీ మాజీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే వివాదంలో చిక్కుకున్నారు. రోడ్డుపై జరిగిన ఓ ఘర్షణలో ముస్లిం కుటుంబంపై దాడి చేసి, కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హాలేనహళ్లికి చెందిన సైఫ్‌ఖాన్ నిన్న తన కుటుంబంతో కలిసి తుమకూరులో ఓ వివాహ వేడుకకు హాజరై ఇన్నోవా క్రిస్టా కారులో తిరిగి వస్తున్నారు. సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో నిజగల్ సమీపంలో తెలుపు రంగు ఎక్స్‌యూవీ700 కారు ఒకటి వారి వాహనాన్ని అడ్డగించింది. ఆ కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని, వారిలో ఒకరు 'నేను డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చాను' అని అరుస్తూ తమ కారును రోడ్డు పక్కకు ఆపమని బలవంతం చేశారని సైఫ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం, ఆ ముగ్గురిలో ఒక వ్యక్తి, తనను తాను గన్‌మ్యాన్‌గా చెప్పుకుంటూ సైఫ్‌పై చేయి చేసుకున్నాడు. మరో వ్యక్తి సైఫ్ సోదరుడు సల్మాన్ ఖాన్‌ను కారులోంచి బయటకు లాగి దాడి చేయడంతో అతని మూడు పళ్లు విరిగిపోయాయి. మూడో వ్యక్తి అనంతకుమార్ హెగ్డే అని సైఫ్ గుర్తించారు. 'వాళ్లు సాబ్రు గ్రూప్ వాళ్లు, కొట్టండి!' అంటూ హెగ్డేనే దాడికి పురిగొల్పారని సైఫ్ ఆరోపించారు. 'సాబ్రు' అనే పదాన్ని కర్ణాటకలో ముస్లింలను కించపరిచేందుకు వాడే గ్రామ్య పదంగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఇరాన్, ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న 380 మంది భారతీయులు

- ఇవాళ ఇరాన్ నుంచి 219 మంది, ఇజ్రాయెల్ నుంచి 161 మంది ఢిల్లీకి
- ఇజ్రాయెల్ నుంచి ఇదే మొదటి విమానం, జోర్డాన్ మీదుగా తరలింపు
- ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2,295 మందిని తీసుకొచ్చిన భారత్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' ద్వారా మంగళవారం మరో 380 మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో 219 మంది ఇరాన్ నుంచి రాగా, 161 మంది ఇజ్రాయెల్ నుంచి వచ్చినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) అధికారికంగా ప్రకటించింది. తాజా రాకతో ఇరాన్‌లో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల మధ్య చిక్కుకున్న మొత్తం 2,295 మంది భారత పౌరులను ఇప్పటివరకు విజయవంతంగా వెనక్కి తీసుకువచ్చినట్లయింది. ఇరాన్‌లోని మషద్ నుంచి బయలుదేరిన ప్రత్యేక విమానం 219 మంది భారతీయులతో న్యూఢిల్లీలో ల్యాండ్ అయింది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా తెలియజేసింది. ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్ నుంచి 219 మంది భారతీయ పౌరులను తరలించిన ప్రత్యేక విమానం ఈరోజు ఉదయం 03:30 గంటలకు మషద్ నుంచి న్యూఢిల్లీకి చేరుకుంది. దీంతో ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2,295 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చాం" అని పేర్కొంది. ఇజ్రాయెల్ నుంచి భారతీయులను తరలించే ప్రక్రియ నిన్న జోర్డాన్ మీదుగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదటి విమానంలో 161 మంది భారత పౌరులు మంగళవారం ఉదయం 8:20 గంటలకు అమ్మన్ నుంచి న్యూఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ బృందానికి కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి పబిత్ర మార్గరీటా స్వయంగా విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పబిత్ర మార్గరీటా మాట్లాడుతూ... "ఇజ్రాయెల్ నుంచి తరలించిన 161 మంది భారతీయుల మొదటి బృందానికి స్వాగతం పలకడం చాలా సంతోషంగా ఉంది. వీరంతా కొద్దిసేపటి క్రితమే న్యూఢిల్లీ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నారు. మేము అక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాము. ఇరాన్ మరియు ఇజ్రాయెల్‌లోని మన పౌరులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నాము. ఆపరేషన్ సింధు కింద పౌరులందరూ సురక్షితంగా స్వదేశానికి చేరుకుంటున్నారు" అని తెలిపారు మరో ప్రయాణికుడు మాట్లాడుతూ... "విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అద్భుతంగా పనిచేసింది. తరలింపు ప్రక్రియ చాలా సజావుగా సాగింది. మా ప్రయాణాన్ని ఇంత సౌకర్యవంతంగా చేసినందుకు మంత్రిత్వ శాఖకు నా కృతజ్ఞతలు" అని తెలిపారు.

## మూడో ప్రపంచ యుద్ధమే వస్తే ఈ దేశాల్లో సేఫ్

**వేద న్యూస్, డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొంది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి అమెరికా అడుగుపెట్టడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉద్రిక్తతలు చల్లబడే అవకాశం ఉంది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరు దేశాలు ఏమేరకు కట్టుబడి ఉంటాయనే విషయంలో కొంత ఆందోళన ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు అణు కేంద్రాలపై అమెరికా దాడులకు ముందే జాగ్రత్తపడ్డ ఇరాన్.. ఆయా కేంద్రాల నుంచి 400 కిలోల యురేనియం నిల్వలను రహస్య ప్రాంతానికి తరలించిందని ఇటు ఇజ్రాయెల్, అటు అమెరికా ఆరోపిస్తున్నాయి. ఈ విషయంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఒకవేళ మూడో ప్రపంచ యుద్ధమే వస్తే భూమి మీద సేఫ్ గా ఉండే దేశాలు ఏవంటే..

అంటార్కిటికా, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, గ్రీన్‌లాండ్, ఇండోనేసియా , టువాలుజి, అర్జెంటీనా, భూటాన్‌జి, చిలీజి, ఫిజీజి, దక్షిణాఫ్రికాజి

వేద న్యూస్

బుధవారం జూన్ 25, 2025

# సేవా సారథి మిట్టపల్లి

- జనక్షేత్రంలో అడుగెడితే ప్రావీణ్యుడికే ప్రజల పట్టం
- లయన్స్ క్లబ్ ద్వారా సుల్తానాబాద్ వాసులకు సేవలు
- ప్రవీణ్ కుమార్ మున్సి'పోల్' బరిలో నిలవాలని పీపుల్ రిక్వెస్ట్





**వేద న్యూస్, సుల్తానాబాద్:**

నలుగురికి సేవ చేయాలనే ఆశయం.. దాని కోసం ఎంత ఖర్చయినా వెనుకాడకుండా, కష్టమైనా పడే ఓర్పు.. ఆనందం ఎదుటి వారి చిరునవ్వుల్లో ఉంటుందని నమ్మే వ్యక్తి ఆయన. చేతికి ఎముక లేని దాతగా జనంలో పేరు సంపాదించుకుని.. తెర వెనుక ఉండి ప్రజా సంక్షేమం' కోసం పాటు పడుతున్న మృదుస్వభావి.. ఇంతకీ ఆయనెవరంటే.. లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవలందిస్తున్న సేవా సారథి సుల్తానాబాద్ మున్సిపల్‌వాసి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్. ఏ పదవి లేకున్నా ప్రజల కోసం పరితపిస్తూ.. నిబద్ధతతో సేవలందిస్తున్న ప్రవీణ్.. ప్రజాక్షేత్రంలోకి దిగితే పోటీలో నిలబెడితే వార్ వన్ సైడ్ అయి.. విక్టరీ కన్ఫర్మ్ అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆయన సారథ్యంలో అభివృద్ధి పరుగులు పెట్టడం ఖాయమని అంటున్నారు.

### సేవామార్గంలో పయనం

మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ పేరు చెబితే చాలు.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో తెలియని వారు ఉండబోరు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సేవామార్గంలో ముందుకెళుతూ.. పంచే గుణం కలిగి ఉన్న నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు. విషయం, సందర్భం ఏదైనా ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా తెరవెనుక ఉండి తన అనుచరగణం, కార్యకర్తల ద్వారా జరగాల్సిన కార్యక్రమాలు, పనులను నిరాటంకంగా జరిపించేలా వ్యూహరచన చేయగల ధీశాలి ప్రవీణ్. కార్యకర్తలు, అనుచరులకు అండగా నిలుస్తూ.. అనుకున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయగల నేర్పరితనం, క్రియాశీలత కలిగిన లీడర్ మిట్టపల్లి ప్రవీణ్.

### అందరివాడు ప్రవీణ్

మృదుస్వభావి అయిన ప్రవీణ్ రాజకీయాలకు అతీతంగా సేవాసారథిగా, అజాతశత్రువుగా అందరి ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఈ క్రమంలోనే రాబోయే ఎన్నికల్లో ఆయన ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టాలని జనం కోరుతున్నారు. మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ బరిలోకి దిగితే.. గెలుపు నల్లేరు మీద నడకే అని అభిప్రాయపడుతున్నారు. అందరినీ కలుపుకుని పోయే స్వభావం కలిగి, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సాయం చేసే గుణం ఉన్న ప్రవీణ్ ప్రావీణ్యం జనం మనసులో ఉందని, ఆయన జనంలోకి వస్తే విక్టరీ ఖాయమని అంటున్నారు.

పని చేసుకుని పోయే తత్వం కలిగి, నలుగురిని ముందుంచి వెనుకుండి వారికి అండగా నిలిచే సామర్థ్యం కలిగిన ప్రవీణ్ ప్రజాక్షేత్రంలోకి రావాలని మున్సిపల్ వాసులు కోరుతున్నారు. మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో ఆయన ఏ వార్డు నుంచి బరిలో దిగినా.. అక్కడ ప్రత్యర్థికి ముచ్చెమటలు ఖాయమని అభిప్రాయం వినబడుతోంది. ఆయన కంటెస్ట్ చేస్తే చాలు.. మున్సిపల్ చైర్మన్ అయినట్టేనని కూడా పేర్కొంటున్నారు.

### సేవాదనుడు ప్రవీణ్

అభివృద్ధిలో సుల్తానాబాద్ మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్లగలడం సేవాదనుడు అయిన ప్రవీణ్‌కు సాధ్యమని కొందరు వెల్లడిస్తున్నారు. ప్రజల్లో మమేకమయి ఉండే ప్రవీణ్ తప్పనిసరిగా ప్రజాక్షేత్రంలోకి దిగి పోటీ చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఆయన పోటీ కోసం కొందరు అయితే వేచి చూస్తున్నారు. రాజకీయంగా ఆయన బీజేపీలో ఉండగా, సుపరిపాలన ఆయన ధ్యేయంగా ఉంటుందని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి బాటలో పయనం ఆయనతోనే సాధ్యమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# 60 ఏండ్ల ఘన చరిత్ర

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లింది. 2017లో స్వర్ణోత్సవ సంబురాలను ఘనంగా జరుపుకుంది. 1965 నుంచి నిర్విరామంగా ఈ విద్యావనం సౌరభాలను పంచుతూనే ఉంది. సువిశాల ప్రాంగణంలో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు చక్కటి వాతావరణం డిగ్రీ కాలేజీలో ఉంది. పచ్చని చెట్లు, విశాల ప్రాంగణంలో హాయిగా విద్యార్థులు సాయంకాలం మైదానంలో నచ్చిన ఆటలు ఆడుకోవచ్చు. ప్రస్తుతం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా(ఎఫ్ఏసీ) డాక్టర్ బి.రమేశ్ ఉన్నారు.

**కాలేజీలో అన్ని వసతులున్నాయి:**

**- డాక్టర్ బి.రమేశ్, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)**




కాలేజీలో అన్ని వసతులున్నాయి. ఉన్నత విద్యను అభ్యసించిన అధ్యాపకులు ఉన్నందున విద్యార్థులు ఈ కాలేజీలో చేరి మీ భవిష్యత్తుకు బాటలు వేసుకోండి. కాలేజీలోని టీజీ కేసీ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకోవచ్చు. ఎన్ఎస్ఎస్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. కాలేజీలో బీఏహెచ్.ఈ.పీ, బీఏ ఆఫీస్ మేనేజ్‌మెంట్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సి డైరీ, బీఎస్సీ క్రాఫ్ ప్రొడక్షన్, బీఎస్సి బీ. జెడ్. సీ, బీ ఎస్ సీ బీ.జెడ్.సీ.ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి అధునాతన కంప్యూటర్ ల్యాబ్ కాలేజీలో అవెయిలబుల్‌గా ఉంది. విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యంతో పాటు తాగునీటికి మినరల్ వాటర్ ప్లాంట్.. 1,300 గ్రంథాలు, 25 మ్యాగజైన్స్, 5 దినపత్రికలతో కూడిన లైబ్రరీ, రీడింగ్ రూం ఉన్నది. డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ క్లాస్ రూంలు, వర్చువల్ టెక్నాలజీలో బోధన ఉంటుంది. అధునాతన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

# ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో (మార్చి 2015 చివరి వరకు) సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ ద్వారా 2025-26 సం. రానికి సంబంధించి వరంగల్ జిల్లా అన్నువల్ క్రెడిట్ ప్లాన్ కింద రూ.9274.25 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వం యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెంపొందించేందుకు కృషిచేస్తున్నదని, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటులో సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు తగ్గకుండా చూడాలని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో జిల్లా యంత్రాంగం ద్వారా స్ఫూర్తి కార్యక్రమం 5వ తరగతి నుండి డిగ్రీ చదివే విద్యార్థులకు ప్రతి వారం నిర్వహిస్తున్నామని, అందులో బ్యాంకర్లు భాగస్వాములై విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. పీఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష




అభియాన్ క్రింద ఎస్టీ ప్రాంతాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అవగాహన, నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను కోరారు.

అనంతరం కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో పంట రుణాలకు గాను రూ.1802.08 కోట్లు రైతులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.1702 కోట్లు లు అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3785.18 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.3653 కోట్లు అందించినట్టు తెలిపారు. భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 997.63 కోట్ల రూపాయలకు గాను రూ. 1486 కోట్లు, ప్రాధాన్యత ఉన్న రంగాలకు రూ. 4891.15 కోట్లకు గాను రూ. 5347 కోట్లు అందించినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 628 కోట్లకు గాను రూ. 868 కోట్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హావేలి రాజు, యూనియన్ బ్యాంకు ఆర్ హెచ్ కమలాకర్, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, నాబార్డ్ ఏజీఎం చైతన్య రవి, బ్యాంకర్ రవి, వ్యవసాయ అధికారి అనురాధ , పశుసంవర్ధక శాఖ బాలకృష్ణ, జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మా ప్రభుత్వ ప్రయారిటీ రైతే..

**మొదటి పేజీ తరువాయి**

చర్చకు కేసీఆర్ సిద్ధమా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలని కోరారు. తెలంగాణ ద్రోహులెవరో గోదావరి జలాల దొంగలెవరో అసెంబ్లీలో తేలుద్దామని వెల్లడించారు.

### కాళేశ్వరం కట్టిన మూడేళ్లకే కూలేశ్వరమైంది

కాళేశ్వరం కట్టిన మూడేళ్లకే కూలేశ్వరమైందని, రూ.లక్ష కోట్లు గంగలో కొట్టుకుపోయాయాయని, కాళేశ్వరం గోదావరిలో కొట్టుకుపోవడానికి కారణం కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం రూ.వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. నాణ్యత, ప్రణాళిక లోపం వల్ల మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల కూలాయని, ప్రాజెక్టులు కూలినందుకు చిన్న కాళేశ్వరంలో కేసీఆర్‌ను ఉరితీసినా తప్పులేదని రైతులంటున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రభుత్వ సల హాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణు గోపాల్ రావు, రైతు కమిషన్ చైర్మన్ కోదం డరెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కల్వర్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### మేయర్ గుండు సుధారాణి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

కల్వర్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం నగర పరిధిలోని 28వ డివిజన్ సుశీల్ గార్డెన్ ప్రాంతంలో నిర్మిస్తున్న కల్వర్టును మేయర్ క్షేత్రస్థాయిలో సందర్శించి సమర్థవంతంగా పూర్తి చేయుటకు తగ సూచ నలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కల్వర్టు డ్రైన్ వర్క్ ల పనితీరును పరిశీలించిన మేయర్ గతంలో ఈ కల్వర్టు మూసివేసి ఉండేదని అట్టి కల్వర్టును విస్తరించి పరిమాణాన్ని పెంచి పునర్మించడం జరుగు తుందని వర్షాకాలం నేపద్యంలో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించిన మేయర్ ఈ ప్రాంతం లో నిర్మితమవుతున్న డ్రైనేజీ పనులపురోగతిని ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏంహెచ్ఓ డా.రాజేష్, వర్క్ ఇన్స్పెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మహమ్మద్ సమీ పెయింటర్ గా జీవనం కొనసాగిస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెట్ పల్లి డివిజన్ పెయింటర్స్ అండ్ పిఓపి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుని కుటుంబానికి అండగా అధ్యక్షుడు ఏశమేని గణేష్ ఆధ్వర్యంలో సంఘసభ్యులతో కలిసి మృతి చెందిన కార్మికుడు సమీ భార్యకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సమీ కుమారుడు షాకీర్ మాట్లాడు తూ..వారి కుటుంబానికి అండగా నిలబడి సహాయం చేసినందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి మాతంగి శ్రవణ్, చిట్యాల శ్యామ్,కనుక లక్ష్మణ్, రేవాళ్ళ రాజన్న,మద్దూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా కోటగిరి వెంకటస్వామి

**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి :**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సెల్ లీగల్, హ్యూమన్ రైట్స్, సమాచార హక్కు విభాగం కమిటి రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ మండల పరిషత్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది కోటగిరి వెంకటస్వామిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని కమిటీ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని అన్నారు. ఈ నియమకానికి సహకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు,మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరం, నిజామాబాద్ పార్లమెంట్ లీగల్ సెల్ కో ఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్, జగిత్యాల జిల్లా లీగల్ సెల్ ఇంచార్జ్ సలీమ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కోటగిరి వెంకటస్వామి తెలిపారు.



## భద్రకాళి ఆలయ ధర్మకర్తకు సన్మానం

**వేద న్యూస్, కాజీపేట :**

ఓరుగల్లు ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయ దేవాలయంకు నూతనంగా నియమితులైన ధర్మకర్త పాలడుగుల ఆంజనేయులును మంగళవారం సోమిడి గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి అలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమిడి గీతా పారిశ్రామిక సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బొలికొండ యాదగిరి గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు బాబురావు గౌడ్, శేఖర్, రాంకీ, సుధాకర్, కరుణాకర్, రాజేందర్, రాజు, లతిత గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్రీ ఇన్‌ఫెర్టిలిటీ క్యాంప్‌నకు స్పందన

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఫ్రీ ఇన్‌ఫెర్టిలిటీ క్యాంప్ నిర్వహించారు. సూర్యా ఫెర్టిలిటీ సెంటర్ ఇందిరా ఐవీఎఫ్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఉచిత ఇన్ ఫెర్టిలిటీ, టెస్ట్ ట్యూబ్ బేబీ సంప్రదింపుల శిబిరానికి స్పందన వచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. సుమారు 50 మంది వరకు వచ్చి ఇన్ ఫెర్టిలిటీ కన్సల్టెంట్ డాక్టర్ భవ్యను కలిసి.. సలహాలు తీసుకున్నారు. పేరెంట్ హుడ్ కోరుకుంటున్న వారికి తగు సలహాలు ఇచ్చినట్టు వైద్యులు వెల్లడించారు. క్యాంప్‌లో గైనకాలజిస్ట్, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ ముషం ప్రణీత, ఇందిరా ఐవీఎఫ్ ఇన్ ఫెర్టిలిటీ సెంటర్ వారు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సైకి ఘన సన్మానం

**వేద న్యూస్, వీణవంక:**

వీణవంక మండల ఎస్సైగా బదిలీపై వచ్చిన నూతన అధికారి ఆవుల తిరుపతి ని కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా పోలీస్ స్టేషన్ లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి.. శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రజల అధికారి గా ఆయన చక్కటి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లక్ష్మక్క పల్లె మాజీ సర్పంచ్ దాసారపు సుజాత లక్ష్మణ్, లక్ష్మక్క పల్లి యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్, కూర రాజిరెడ్డి, దోమకొండ రవీందర్, నారాయణరెడ్డి, సదానందం పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073